క్లుప్తంగా

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు అదనంగా ఆర్థిక సహాయం అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సచివాలయాల పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను కానీ, మండలంలోని హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పోరుమామిళ్ల : పక్కా గృహాల లబ్ధిదారులకు ప్రధాన మంత్రి ఆవాజ్‌యోజన, ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సహాయం అందిస్తున్నట్లు ఎంపీడీఓ రమణా రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ. 1.80 లక్షలు అందజేస్తుండగా, ఇప్పుడు అందుకు అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు అదనంగా సహాయం అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు.

నిధులు మంజూరు

బి.కోడూరు : మండలంలోని అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయని ఎంపీడీఓ ఎంపీడీఓ భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణాలకు రూ.1.80 లక్షలు ఇచ్చిందని, దీనికి ప్రస్తుతం ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు అదనంగా కలిపి రూ.2.30 లక్షలు అందజేయడం జరుగుతుందని, అలాగే ఎస్టీలకు అదనంగా రూ.75 వేలు కలిగి రూ.2.55 లక్షలు ప్రభుత్వం అందించనుందని, ఈ అవకాశాన్ని గృహ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

రాజుపాళెం : విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పదో తరగతి పరీక్షలు రాయాలని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు జగన్‌మోహన్ రెడ్డి, రామభూపాల్ రెడ్డి, శంకుంతలారెడ్డి పేర్కొన్నారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు తీసుకురావడంతో పాటు జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. అప్పుడే చదువుచెప్పిన ఉపాధ్యాయులకు చదివించిన తల్లిదండ్రులకు మంచి బహుమతి ఇచ్చినట్లు అవుతుందన్నారు. పరీక్ష సమయం కంటే ముందుగానే సెంటర్‌కు వెళ్లాలని సూచించారు.

సన్మానం



జాకీర్ అహ్మద్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

ప్రొద్దుటూరు క్రైం : ఇటీవల రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన బేపారి జాకీర్ అహ్మద్‌ను ప్రొద్దుటూరు బార్ కౌన్సిల్ ముస్లిం న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం సాయంత్రం ఉస్లిం కమ్యూనిటీ హాల్‌లో ముస్లిం న్యాయవాదులు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాకీర్ అహ్మద్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాదులు దాదాపీర్, జిలాని బాషా, అబిద్ హుస్సేన్, లాలు సాహెబ్, నూరుల్లా, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తల్లం వెంకటశేషయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత బస్టాండ్ సమీపంలో వాసవి క్లబ్ సిరిపురం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం తల్లం జ్యువెలర్స్ అధినేత తల్లం వెంకటశేషయ్య ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. చలివేంద్రం నిర్వహణకు ఆర్థిక సహకారం అందించిన వెంకటశేషయ్యకు క్లబ్ అధ్యక్షుడు గుండా పద్మనాభయ్య ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు వరప్రసాద్‌రెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షుడు నరేంద్ర, వేణుగోపాల్, సుధాకర్ గుప్తా, నరసింహారావు, సురేష్ బాబు, రామారావు, గోపాలకృష్ణయ్య, వెంకట వరలక్ష్మి, సుష్మ, చంద్రకళ పాల్గొన్నారు.

తవ్వుకో.. దండుకో..!

- హైవే రోడ్ల కోసం ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లు
- అటు వైపు కన్నెత్తి చూడని అధికారులు
- రాయల్టీ కట్టకపోవడంతో ప్రభుత్వానికి నష్టం



మట్టిని తవ్వుతున్న ఎక్స్‌కవేటర్



మట్టిని తరలిస్తున్న టిప్పర్

బ్రహ్మంగారిమఠం : బి.మఠం మండలంలో హైవే రోడ్లు రావడం సామన్యుడికి సంతోషమే.. కానీ ప్రభుత్వానికి లక్షలాది రూపాయలను కాంట్రాక్టర్లు ఎగనామం పెడుతున్నారు. మైదుకూరు శాసన సభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్.. కాంట్రాక్టర్లు రాయల్టీలు కట్టకుండా హైవే రోడ్డు పనులకు మట్టి తోలుతున్నారని బహిరంగగా ప్రచారం చేసినా.. వారు యథేచ్ఛగా తరలిస్తూనే ఉన్నారు. బి.మఠం మండలం మైదుకూరు– బద్వేల్ రోడ్డును నాల్గు వరుసలుగా విస్తరిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం కోసం కాంట్రాక్టర్ రేకలకుంట పంచాయతీలో క్యాంపు ఏర్పాటు చేసుకొని.. అక్కడి నుంచి కంకర, మట్టి, గ్రావెల్ వంటివి తరలిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా.. ప్రభుత్వానికి ఎలాంటి రుసుం చెల్లించకుండా అనధికారికంగా మట్టి, గ్రావెల్ కంకరను తరలిస్తున్నారు.

కాంట్రాక్టర్ల ఇష్టా రాజ్యం

నాగిశెట్టిపల్లె రెవెన్యూ పొలంలో మట్టి తరలింపునకు ఒక కాంట్రాక్టర్ రెవెన్యూ అధికారులకు ఎన్‌ఓసీ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అనుమతులు ఉన్నాయనే ధైర్యంతో లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలిస్తున్నాడు. ఇది ఇలా ఉంటే మల్లేపల్లె, పగురాళ్లపల్లె, ముడుమాల పంచాయతీలో గ్రీన్ హైవే రోడ్డు పనులు సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణం కోసం పలుగురాళ్ళపల్లె పొలంలో కంట్రాక్టర్లు ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నా అడ్డుకొనే నాథుడు లేడు. రెవెన్యూ, మైన్స్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అసలే బి.మఠం మండలం అన్ని రంగాలలో వెనుకబడి ఉంది. రాయల్టీ రూపంలో గ్రామ పంచాయతీలకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని పలువురు సర్పంచ్‌లు వాపోతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు ఎలా ఉన్నా.. చూసేవారు లేరు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న కంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్ (డీటీ) జాన్స్ ఏమంటున్నారంటే..

హైవే రోడ్ల నిర్మాణ పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు ప్రభుత్వ స్థలాలలో మట్టిని తరలించాలంటే తప్పకుండా ఎన్‌ఓసీ తీసుకోవాలని చెప్పాం. ఎన్‌ఓసీకి ఒకరిద్దరు దరఖాస్తులు చేసుకున్నారు. వారికి ఇంకా ఎన్‌ఓసీలు ఇవ్వలేదు. రేకలకుంట, నాగిశెట్టిపల్లె, మల్లేపల్లె, ముడుమాల, పలుగురాళ్ళపల్లె పంచాయతీలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మట్టి, గ్రావెల్, కంకర రాళ్లు తరలిస్తున్న వారిపై మైన్స్ అధికారులతో మాట్లాడి కలెక్టర్ ఆదేశాల మేరకు కేసులు పెడుతాం. వారి యంత్రాలను సీజ్ చేయడం, రాయల్టీ కింద ఫైన్లు వేయడం జరుగుతుంది. ఇప్పటికే జేసీబీలు, టిప్పర్లు సీజ్ చేశాం.

కనుల పండువగా తొట్టిమెరవణి



స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతరాజపురం పంచాయితీ లక్ష్మీపాలెం గ్రామంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన స్వామి తొట్టిమెరవణి కనుల పండువగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయ ప్రాంగణానికి చేరుకుని తొట్టిమెరవణి కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం చేశారు. అనంతరం మధ్యాహ్నం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపైకి చేర్చి తొట్టిమెరవణి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. తొట్టిమెరవణి ముగిసిన అనంతరం భక్తుల దర్శనం కోసం స్వామి వారిని వాహనంపై నుంచి కిందకు దించి గ్రామోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన చెక్కభజన, దేవతామూర్తుల వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బద్వేలు అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ ఆధ్వర్యంలో ఎస్ఐ జె.రవికుమార్, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా కోట పోలేరమ్మ తిరునాల



వేడుకల్లో పాల్గొన్న నల్లేరు విశ్వనాథరెడ్డి

పోరుమామిళ్ల : పట్టణంలోని కోటపోలేరమ్మ తిరునాల ఆదివారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామునే అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. కుంకుమబండ్లు, కోలన్న బండ్లు పట్టణంలోని వీధుల నుంచి ఊరేగింపుగా వచ్చాయి. ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి, ఉపసర్పంచ్ రాళ్లపల్లె రవికుమార్, రఘు, నారాయణ, బాలగురివిరెడ్డి పోలేరమ్మను దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.

పొట్టి శ్రీరాములు జీవితం.. భావితరాలకు ఆదర్శం



ప్రొద్దుటూరు కల్చరల్ : పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బుశెట్టి రామ్మోహనరావు, ఆర్యవైశ్యులు



అట్లూరు గ్రంథాలయంలో..



చాపాడు గ్రంథాలయంలో..

ప్రొద్దుటూరు కల్చరల్ : అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహనరావు కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక లైట్‌పాలెం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

■ స్థానిక రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం, పినాకిని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, అకౌంటెంట్ కృష్ణయ్య, రెడ్డప్పరెడ్డి, రవిబాబు, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

■ పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక లైట్‌పాలెం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి వాసవి క్లబ్ సిరిపురం అధ్యక్షుడు గుండా పద్మనాభయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. క్లబ్ ట్రెజరర్ సురేష్‌బాబు, సభ్యులు సుబ్బరాయుడు, నరసింహారావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగాలు మరువలేనివి

ఖాజీపేట : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని ఖాజీపేట వాసవీక్లబ్ అధ్యక్షుడు గాదం శెట్టి వెంకటసుబ్బయ్య కొనియాడారు. ఆదివారం పొట్టి శ్రీరాముల జయంతిని పురస్కరించుకుని ఖాజీపేట బస్టాండ్ కూడలిలోని ఆయన విగ్రహానికి వాసవీ క్లబ్ సభ్యులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు ప్రాణాలను కూడా ఫణంగా పెట్టిన మహోన్నత వ్యక్తి అని, ఆయన జీవితం ఎప్పటికీ అనుసరణీయమన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రా ఏర్పాటుకు తన ప్రాణాలను అర్పించిన అమరుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ సభ్యులు దరిషా లక్ష్మికుమార్, సురేష్, ఆర్లగడ్డ వీరయ్య, తాతా వెంకటసుబ్రహ్మణ్యం, బాలసుబ్రహ్మణ్యం, మంచిగంటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చాపాడులో..

చాపాడు : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాముల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ.. 1991 మార్చి 16న పొట్టి శ్రీరాములు జన్మించారని, మహాత్మాగాంధీ శిష్యుడిగా ఈయన 1952 అక్టోబరు 19 నుంచి డిసెంబర్ 15 వరకూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరుడయ్యారని గుర్తుచేశారు. పొట్టి శ్రీరాములు త్యాగం వలన ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీడీసీ వి.రవిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు ఆదర్శప్రాయుడు

అట్లూరు : పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని అట్లూరు గ్రంథాలయాధికారి ఎం. సుధాకర్ కొనియాడారు. ఆదివారం అట్లూరు శాఖ గ్రంథాలయంలో పొట్టి రాములు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ అమరజీవి త్యాగం ఫలితంగానే ఆంధ్రరాష్ట్ర అవతరించిదని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు మస్తాన్‌యాదవ్, కృష్ణారెడ్డి, రామచంద్ర, గురుస్వామి, వేణుగోపాల్, కేసయ్య పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పోరుమామిళ్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి అమ్మవారిశాల అధ్యక్షుడు విశ్వనాథుల ప్రసాద్, సెక్రటరీ యాదాల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు ఓబయ్య, తులసి సుధాకర్, డీకే సుబ్బారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు నారాయణ, మాలెపాటి సత్యనారాయణ, కొప్పరపు గురుప్రసాద్, సుబ్బరాజ పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు ఆశయాలను కొనసాగించాలి

బద్వేలు అర్బన్ : రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం నేటి తరానికి ఆదర్శం కావాలని, ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలని పెన్షనర్స్ అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షుడు గంజికుంటపుల్లయ్య, ప్రధాన కార్యదర్శి కత్తిపుల్లయ్య పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆత్మ త్యాగఫలితంగానే ఆంధ్రరాష్ట్ర అవరతణం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.పిచ్చయ్య, సెక్రటరీ వెంకటేశ్వర్లు, సభ్యులు గ్రేసియస్, ఇస్మాయిల్, ఆరోగ్యం, నారాయణరెడ్డి, రామగంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్లలో..



బద్వేలు అర్బన్ : పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఖాజీపేట : పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

పకడ్బందీగా పది పరీక్షలకు ఏర్పాట్లు

- నేటి నుంచి ప్రారంభం
- డివిజన్‌లో పరీక్ష రాయనున్న 12,678 మంది విద్యార్థులు



అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో నంబర్లు వేస్తున్న ప్రధానోపాధ్యాయుడు గురప్ప

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రాంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటల సమయానికి పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రొద్దుటూరు డివిజన్‌లో 18 మండలాల్లోని ప్రభుత్వ, మున్సిపల్, ప్రైవేట్, కేజీబీవీ, ఎపీడబ్ల్యూఆర్‌ఎస్, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన 12,678 మంది విద్యార్థులు 75 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారు. అలాగే ప్రొద్దుటూరు మండలంలో ఉన్న 81 ప్రభుత్వ, ప్రైవేటు, మున్సిపల్ ఉన్నత పాఠశాలలకు చెందిన 3,770 మంది విద్యార్థులు 23 కేంద్రాల్లో 10వ తరగతి పరీక్షలు రాయనున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో బెంచీల మీద హాల్ టికెట్ నంబర్లు వేయడంతో పాటు తాగునీటి, విద్యుత్ సౌకర్యం కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయనున్నారు.

144 సెక్షన్ అమలు

కొందరు విద్యార్థులు ఆదివారమే తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు వెళ్లి గదులను తెలుసుకున్నారు. అలాగే పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ కేంద్రాలను మూసివేయనున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించి 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు.

ప్రశాంతగా పరీక్షలు రాయాలి



విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి చేరుకుని గదులను చెక్ చేసుకోవాలి. ప్రశాంతంగా ఉండి ప్రశ్నాపత్రం ఇవ్వగానే బాగా చదివి, ముందుగా బాగా తెలిసిన ప్రశ్నలకు సమాధానం రాయాలి. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాం.

– సావిత్రమ్మ, ఎంఈఓ, ప్రొద్దుటూరు మండలం

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక లక్ష్య కార్డియాక్, కంటి ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని విశేష స్పందన లభించింది. డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి 43 మంది రోగులకు పరీక్షించారు. వీరిలో 19 మందికి ఉచితంగా ఈసీజీ, ఏడుగురికి ఉచితంగా గుండె స్కానింగ్ చేసి చికిత్స అదించి సూచనలు ఇచ్చారు. డాక్టర్ హరిత 32 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి చికిత్స, సూచనలిచ్చారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని త్యాగరాజకాలనీలో నూతనంగా నిర్మించిన అనంతరామస్వామి, త్యాగరాజస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పోలిరెడ్డి, పుత్తాశ్రీరాములు, అట్లూరు మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్ వెంకటసుబ్బమ్మ, వార్డు ఇన్‌చార్జి రజనీకాంత్, నాయకులు మాడపూరు నడిపి వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, మాడపూరు బ్రహ్మయ్య, రాజేష్, మౌలాలి, షఫి పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన దంపతులతో మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ఖాజీపేట : ఖాజీపేటలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏటూరు గ్రామానికి చెందిన మూల వెంకటేశ్వర్‌రెడ్డి కుమారుడు మునేంద్రారెడ్డి వివాహం ఘనంగా జరిగింది. వివాహ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని వధూవరులకు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి పీపీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



వధూవరులతో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : మండలంలోని మూలవారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగిరెడ్డి కుమారుని వివాహానికి ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రేమ, కరుణ, దయ కలిగి ఉండాలి



కడప మేత్రాసన పీఠాధిపతిని సన్మానిస్తున్న ఫాతిమామాత పుణ్యక్షేత్ర విశ్వాసులు

బద్వేలు అర్బన్ : విశ్వాసులు క్రీస్తు సూక్తులను ఆచరిస్తూ ఆరాధిస్తూ ఇతరులపై ప్రేమ, కరుణ, దయ చూపుతూ జీవించాలని కడప మేత్రాసన పీఠాధిపతి మోస్ట్ రెవ. డాక్టర్ సగినాల పాల్‌ప్రకాష్ పేర్కొన్నారు. కడప మేత్రాసన పీఠాధిపతిగా ఎంపికై తొలిసారి బద్వేలు విచారణకు హాజరైన సందర్భంగా ఆదివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని ఫాతిమా మాత ఆలయంలో ఘనంగా దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపూర్ణమైన హృదయం కలిగి విశ్వాసంతో ప్రార్థిస్తే కష్టనష్టాలు తొలగిపోతాయని సూచించారు. అనంతరం ఆయన విశ్వాసులను ఆశీర్వదించారు. అలాగే పీఠాధిపతిని ఫాతిమా మాత విచారణ సభ్యులు, విశ్వాసులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫాతిమామాత పుణ్యక్షేత్ర డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, ఆయా విచారణ గురువులు, విశ్వాసులు పాల్గొన్నారు.